క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో జరిగే అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, నాయకులు గోవిందచారి, కాలనీ నాయకులు నరసింహారావు, యాదగిరి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులను పరిశీలిస్తున్న డీసీ, కార్పొరేటర్

ఎల్‌బీనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకూడదని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణతో కలిసి కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేష్‌బాబు, శానిటేషన్ డీఈ నీలిమ, ఏఈలు రవీంధర్‌రెడ్డి, గోపాలకృష్ణ, నాయకులు జలంధర్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, నరసింహరెడ్డి, సంజీవరెడ్డి, క్రాంతి రెడ్డి పాల్గొన్నారు.

మహాగర్జనను విజయవంతం చేయాలి



అందె రాంబాబు

చాదర్‌ఘాట్: ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే వికలాంగుల చేయూత పింఛన్ దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అందె రాంబాబు విజ్ఞప్తి చేశారు. పద్మశ్రీ అవార్డ్ గ్రహీత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మహాగర్జనకు జిల్లాల నుంచి వికలాంగులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని చెప్పి ఇంత వరకు దాని ఊసే లేదన్నారు. హైదరాబాద్ జిల్లా నుంచి దాదాపు 1000 ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్తామన్నారు.

నూతన రోడ్ల నిర్మాణం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ధ్వంసమైన రోడ్ల స్థానంలో నూతన రోడ్లను వేస్తున్నామని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి తెలిపారు. పీఅండ్‌టీ కాలనీ శంకేశ్వరబజార్ క్రాస్ రోడ్డు నుంచి కోదండరాంనగర్ శారదా థియేటర్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. చాలా కాలంగా పాడైపోయిన రోడ్లతో ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను గుర్తించి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.70 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్‌తో విద్యార్థులు

లింగోజిగూడ: సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలో అప్స స్వచ్ఛంద సంస్థ, భారత సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయ, సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, పాఠశాల చైర్మన్ వసంత, సినియర్ కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఉమాదేవి పాల్గొన్నారు.

కంపు కొడుతున్నా..

స్పందించరా?



ఎన్టీఆర్‌నగర్‌లో ఇలా..

దిల్‌సుఖ్‌నగర్: అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యంతో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆర్‌కేపురం, మలక్‌పేట్, సైదాబాద్, అజంపురం, ఐఎస్ సదన్, అక్బర్‌బాగ్, ఛవుణీ, మాదన్నపేట్ తదితర కాలనీల్లో భారీగా వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. దీనికి తోడు డ్రైనేజీ పొంగడంతో మురుగు ఏరులై పారుతూ నడిచేందుకు వీలులేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు.ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట్, సింగరేణి, కాలనీ, ఎన్టీఆర్‌నగర్, తీగలగూడ, భగ్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో గతకొన్ని రోజుల వ్యవధిలోనే అనేక మంది డెంగీ వ్యాధిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, పేరుకుపోతున్న చెత్త చెదారంతో పలు కాలనీలలో విష జ్వరాల విజృంభిస్తున్నా సర్కిల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ మురుగు గుంటలుగా మారడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.



హరిపురి కాలనీ రోడ్డు నెంబర్-3 వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలు



సిరినగర్ కాలనీలో ఇళ్ల మధ్య పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

వరద కాలువలో రసాయన వ్యర్థాలు కలపొద్దు

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఆటోనగర్ పారిశ్రామికవాడ వద్ద వరద కాలువలోకి రసాయన వ్యర్థాలు కలిపితే చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడి హెచ్చరించారు. మన్సూరాబాద్, నాగోలు డివిజన్ల పరిధిలోని ఏడు కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. గత మూడు నెలలుగా వరదకాలువలో రసాయన వ్యర్థాలు, మురుగు నీరు పారుతుండటంతో దుర్వాసనతో చర్మవ్యాధులు వస్తున్నాయని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇలాగే సమస్య ఏర్పడితే ఆటోనగర్‌లోని ప్రతి షెడ్డును పరిశీలించామని, అదేవిధంగా ఆటోనగర్ డంపింగ్ యార్డ్ రోడ్డులో సీసీ కేమారాలను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయ్యిందని గుర్తు చేశారు. ప్రస్తుతం సమస్య పునరావృతం అవుతుందని మరోసారి ఆటోనగర్ పారిశ్రామికవాడ అధికారులు, జీహెచ్ఎంసీ, ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని సీసీ కెమెరాలను పునరుద్ధరణ చేయిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కత్తుల రాంబాబు, కమాలకర్‌రావు, మధు, ప్రవీణ్, అజయ్, కిషోర్, జనార్ధన్, శ్రీనివాస్, రమేష్, జయరాంరెడ్డి, సైదులు, లింగప్ప ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

మైనారిటీల సంక్షేమానికి కృషి



యాకూబ్ పాషా

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మహమ్మద్ యాకూబ్ పాషా నియామితులయ్యారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లోని స్‌అబుల్ కలాం అజాద్ ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో మైనారిటీల సంక్షేమం కోసం చేస్తున్న సేవలను గుర్తించి యాకూబ్ పాషాకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట మైనారిటీ నాయకులు ఖాజా మొయినుద్దీన్, నఫీస్ అహమద్, మాజిద్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూమరుతినగర్‌లోని బంగారు గవ్వల రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో మంగళవారం పలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరుణ్ చంద్ర, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ విజయరంగ, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



మంచన్‌పల్లి లోకేశ్

హస్తినాపురం: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గిరీష్‌కుమార్ వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ గ్రామానికి చెందిన మంచన్‌పల్లి లోకేశ్(31) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఉంటున్నాడు. గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మనస్తాంపం చెంది గత నెల 26న పురుగుల మందు తాగడంతో వెంటనే కుటుంబ సభ్యులు బండ్లగూడ జాగీర్‌లోని మెడిలైఫ్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మీర్‌పేట: రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ విజయం కోసం శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్-2 అధ్యక్షుడు ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మంగళవారం శ్రీరాములును మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టం చేయాలని ఈ సందర్భంగా శ్రీరాములు వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు కసిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, సిద్దాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కార్యదర్శులు ఉన్నారు.

అథ్లెటిక్ మీట్‌లో సత్తా



మెడల్స్ సాధించిన విద్యార్థులతో ప్రదీప్‌కుమార్

వనస్థలిపురం: రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్ మీట్‌లో తమ విద్యార్థి మౌర్య నాయక్ గోల్డ్ మెడల్ సాధించినట్లు చింతలకుంటలోని తపస్వీ స్కూల్ చైర్మన్ గౌరిగ ప్రదీప్‌కుమార్ తెలిపారు. అలాగే జావలిన్ త్రో విభాగంలో ఇద్దరు విద్యార్థులకు బ్రాంజ్ మెడల్స్ వచ్చాయని అన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన మౌర్య నాయక్ ఈ నెల 7న జనగాంలో జరగబోయే స్టేట్ లెవెల్ కాంపిటీషన్స్‌కు ఎంపికయ్యాడన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ లింగం యాదవ్, ప్రిన్సిపాల్ రత్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాదర్‌ఘాట్: బధిరులు, అంధుల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు, సెకండరీ గ్రేడ్ బేసిక్ ట్రైన్డ్ టీచర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లుగా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఇతర వివరాలకు శాఖ వెబ్‌సైట్ (www.wdrc.teanfana.gov.in) లో లభిస్తాయని పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 1వ తేదీ లోగా (wdrc2025recruitment@email.com) మెయిల్ ద్వారా పంపించాలన్నారు.

పేదలకు భరోసా సీఎంఆర్‌ఎఫ్

లింగోజిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల చెంతకు చేరుతున్నాయని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన మధుకర్ అనారోగ్యంతో ఆసుపత్రి చికిత్స పొందిన అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం రాంరెడ్డి తన కార్యాలయంలో మధుకర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

బీసీ ఉద్యమానికి సహకరించాలి

నాగోలు: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చేస్తున్న బీసీ ఉద్యమానికి సకల జనులు సహకరించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి నాయకులు దిటి నరసయ్య, బొడ్డుపల్లి కృష్ణ కోరారు. మంగళవారం న్యూనాగోల్‌లోని ఎస్ఏ డాంగే భవన్, ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకలజనులు ఎలాగైతే ఐక్యమై పోరాటం నిర్వహించారో అదేవిధంగా బీసీల న్యాయమైన రాజకీయ వాటా కోసం చేస్తున్న ఈ ఉద్యమానికి సకల జనులు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఒక అధికార రాజకీయ పార్టీ జాతీయస్థాయిలో రాజకీయ అడ్డంకిగా మారిన విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఆ పార్టీని రానున్న ఎన్నికల్లో రాజకీయంగా భూస్థాపితం చేసేందుకు సన్నద్ధం కావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు బాత రాజు నరసింహ, పల్లె రమేష్ గౌడ్, పందిరి మడేలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి నాయకులు

నిబంధనల మేరకే వ్యాపారాలు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలుక నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: మలక్‌పేట మార్కెట్‌లోని వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు మార్కెటింగ్ శాఖ నిబంధనలకు లోబడి వ్యాపారాలను నిర్వహించాలని, మార్కెట్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ ఆధ్వర్యంలో టీసీఏటీ కార్యాలయంలో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, టీసీఏటీ సభ్యులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్కెట్ బైలా ప్రకారంగా మార్కెట్‌లో బహిరంగ వేలం ఉదయం 8.30కు మాత్రమే ప్రారంభించాలని, అంతకు ముందు మార్కెట్‌లో ఎవరూ ఎలాంటి క్రయవిక్రయాలు నిర్వహించరాదన్నారు. చేగూరి వెంకటరమణ మాట్లాడుతూ.. మార్కెట్‌లో కమిషన్ ఏజెంట్లు మార్కెట్ నిబంధనలకు లోబడి క్రయవిక్రయాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 కార్యదర్శి పుష్పలత, టీసీఏటీ ప్రతినిధులు బట్కిరి వివేకానంద్, దుగ్గు జగదీష్, దడువై ప్రకాశ్‌రావు, కొణిజేటి శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

తల్లిపాలు.. బిడ్డకు మొదటి టీకాతో సమానం

● సూపరింటెండెంట్ డా.కృష్ణ

వనస్థలిపురం: బిడ్డకు తల్లిపాలు అత్యవసరమని, బిడ్డకు పాలు ఇవ్వడంతో తల్లికీ ఎంతో ఆరోగ్యకరమని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కృష్ణ అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో పిల్లల విభాగం ఆధ్వర్యంలో తల్లిపాలపై తల్లులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కృష్ణ, ఆర్ఎంఓ జయమాల, పిల్లల వైద్యులు మాట్లాడుతూ.. తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని, పుట్టిన గంటలోపే బిడ్డకు పాలు ఇవ్వాలన్నారు. మొదటి 6 నెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల పిల్లలకు ఇమ్యూనిటీ పెరుగుతుందని, జబ్బులు రావన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ రాదని అన్నారు. పాలు ఇచ్చే తల్లులకు వెంటనే గర్భం రాదని, దీనివల్ల బిడ్డకు, బిడ్డకు మధ్య గ్యాప్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడియాట్రిక్ హెచ్‌ఓడీ అనిత, అసోసియేట్ ప్రొఫెసర్ శ్వేత, రాజ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డా.కృష్ణ

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.41, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.43, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.25, మునగ రూ.28, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.23, కీర రూ.23, బీన్స్ రూ.75, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

పేకాటరాయళ్ల అరెస్ట్

చైతన్యపురి: పేకాట ఆడుతున్న పలువురిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం..సమతాపురి కాలనీలోని సాయిరాం రెసిడెన్సీ అపార్టుమెంట్‌లోని 103 ఫ్లాట్‌లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు సోమవారం రాత్రి ఆ ఇంటిపై దాడి చేసి పది మందిని అరెస్టు చేశారు.

చేయి తడిపితేనే ఫైల్ కదులుతుందా?



● సరూర్‌నగర్ సర్కిల్‌లో వసూళ్ల పర్వమంటూ ఆరోపణ
● ప్రశ్నిస్తే వేధిస్తున్నారంటూ ఇటీవల బిల్ కలెక్టర్ ఫిర్యాదు

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ సర్కిల్-5 అవినీతికి అడ్డగా మారిందనే ఆరోపణాలు గుప్పుమంటున్నాయి. ప్రస్తుతం వసూళ్లే లక్ష్యంగా కొందరు అధికారులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏ విభాగంలోనైనా చేయి తడిపితే తప్ప ఫైల్ ముందుకు కదలడం లేదని కొందరు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ఆరోపణలు వస్తున్నా విజిలేన్స్ అధికారులు, జోనల్ కమిషనర్ స్పందించకపోవడం ఏంటని ప్రజలు వాపోతున్నారు.

అధికారుల జేబులోకి డబ్బు?

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని సరూర్‌నగర్, చైతన్యపురి, ఆర్‌కేపురం, కొత్తపేట, గడ్డిఅన్నారం డివిజన్‌లు వస్తాయి. ఈ డివిజన్లు అన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందినవే. ఇవాన్ని జాతీయ రహదారికి ఆనుకుని ఉండంతో కమర్షియల్ ప్రాంతం అధికంగా ఉంటుంది.దిల్‌సుఖ్‌నగర్‌లో కాలనీలలో కూడా భారీగా కమర్షియల్ భవనాలు ఉంటాయి.ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో అధికంగా పన్నులు వసూలయ్యే ప్రాంతాలు సరూర్‌నగర్ సర్కిల్‌లో ఉన్నాయని కానీ.. అధికారుల అవినీతితో జీహెచ్ఎంసీ ఆదాయనికి గండి పడుతుందని సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండేళ్లుగా పలు నూతన కమర్షియల్ భవనాలకు ట్యాక్స్ అసెస్‌మెంట్ చేయకుండా భవన యజమానులతో కుమ్మక్కై పర్సంటేజీలను సంబంధిత పలువురు అధికారులు తమ జేబుల్లో వేసుకుంటున్నారని ఇటీవల ఓ బిల్ కలెక్టర్ ఆరోపిస్తూ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేయడం కలకలం రేపింది.

ప్రజావాణిలో ఫిర్యాదు..

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బిల్ కలెక్టర్ శ్రీశైలం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో భవనాల ఫొటోలు, వాటికి వేస్తున్న పన్నులు, వాటికి ఉన్న లైసెన్స్ పూర్తి వివరాలను జోనల్ కమిషన్‌ర్‌కు వివరించారు.అవినీతి పూర్తిస్థాయి సమాచారం తన వద్ద ఉందని వాటిని జోనల్ కమిషన్‌ర్‌కు ఇవ్వడం జరిగిందని శ్రీశైలం తెలిపారు.వైట్ హౌజ్ భవనం సుమారు 200 దుకాణాల వరకు ఉంటాయని వాటిలో సగం కూడా ట్యాక్స్ అసెస్‌మెంట్ చేసుకోలేదని వారిని ప్రశ్నించినందుకు తనను ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు.

భవనాలు పూర్తయిన వెంటనే పన్నులు

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో భవనాలు, దుకణాలు, కమర్షియల్ భవనాలు పూర్తయి వాటిలో అక్యుపెన్సీ అయిన వెంటనే ట్యాక్స్ అసెస్ మెంట్ పన్నులు వసూలు చేస్తున్నాం. ఎక్కడ కూడా అవినీతి జరగలేదు. జీహెచ్ఎంసీ అధికంగా ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

సుజాత, డీసీ